## శిథిలావస్థలో కమర్షియల్ భవనం

### తక్షణమే ఖాళీ చేయండి

### దుకాణదారులకు హెచ్ఎండీఏ ఆదేశాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 10 ( నమస్తే తెలంగాణ ) : శిథిలావస్థలో ఉన్న సరూర్‌నగర్ కాంప్లెక్స్‌ను దుకాణదారులు తక్షణమే ఖాళీ చేయాలని హెచ్ ఎండీఏ హెచ్చరించింది. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 1981లో హైదరబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సరూర్‌నగర్ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించింది. ఇందులో 32 షాపులు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఆ భవనం పురాతనంగా మారడంతో పాటు ఏ క్షణంలో నైనా కూలే ప్రమాదంలో ఉంది. అందుకు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సివిల్ ఇంజినీరింగ్, యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, ఉస్మానియా యూని వర్సిటీలు అధ్యయనం చేసి సమగ్రమైన నివేదికను సమర్పించాయని హెచ్ఎండీఏ వెల్లడించింది. ఈ నిర్మాణంతో ప్రస్తుతం ఉన్న దుకాణదారులకు, చుట్టుపక్కల ఉన్న వాళ్లకు తీవ్ర నష్టం కలగనుంది. దుకాణదారుల లీజు గడువు కూడా 2008లోనే ముగిసింది. వారి భద్రత దృష్ట్యా ఆ నిర్మాణం ఖాళీ చేయాలని.. మరమ్మతులతో పాటు పునరుద్ధరణ చేపట్టనున్నట్టు పేర్కొంది. ఈ మేరకు దుకాణదారులకు నోటీసులు కూడా జారీ చేశారు. ప్రజా ప్రయోజనం దృష్ట్యా ఆ భవనంలో ఉన్న దుకాణదారులు ఖాళీచేయాల్సిన అవసరం ఉందని హెచ్ఎండీఏ సూచించింది. ఎన్నిసార్లు కౌన్సెలింగ్ చేసినా వాళ్లు ఖాళీ చేయకపోవడంతో ఆ భవనాన్ని ఖాళీ చేయించడానికి హెచ్ఎండీఏ ఎస్టేట్ ఆఫీసర్ అనుమతులిచ్చారు. కాంప్లెక్స్‌ను మంగళవారం ఖాళీ చేయిస్తామన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, ఫిబ్రవరి 10 : రాక్ టౌన్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు రాక్‌టౌన్, లలితానగర్, అయ్యప్ప కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ విద్యుత్ శాఖ డీఈ రామకృష్ణ తెలిపారు.

# ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

### ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేసిన బడంగ్‌పేట నాయకులు

బడంగ్ పేట, ఫిబ్రవరి 10 : మహేశ్వరం నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించాలని బడంగ్‌పేట మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన.. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో కొంతకాలంగా ఓపెన్ స్థలాలు, పార్కు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, అధికారులే వాటికి అక్రమ పద్ధతిన అనుమతులు ఇస్తున్నారని తెలిపారు. 31వ డివిజన్‌లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 11,500 గజాల ఓపెన్ స్థలాలు ,పార్కు స్థలాలను ఇటీవల కాలంలో కొందరు ఆక్రమించుకొని, అక్రమ పద్ధతిన ఇంటి నిర్మాణాలు చేపడుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆయన ఎమ్మెల్యేకు తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నట్లు వివరించారు. కోట్ల విలువ చేసే స్థలాలను కొందరు అధికారుల ప్రోత్సాహంతో కాజేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అలాగే కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు అర్థంతరంగా ఆగిపోయాయని, నాలా ఆక్రమణకు గురైనా పట్టించుకోవడం లేదన్నారు. ఎగువ ప్రాంతం నుంచి మురికి , వర్షపు నీళ్లు దిగువ ప్రాంతానికి పోకుండా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని వివరించారు. కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో గత ప్రభుత్వాలు చేపట్టిన పనులన్నీ మధ్యలోనే నిలిపివేశారని అన్నారు. ఇంటి నిర్మాణం చేసుకోవడానికి వీలు లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వం ప్రతిపాదించిన రేడియల్ రోడ్ 26 నంబర్ మందమల్లమ్మ చౌరస్తా నుండి నాదర్‌గుల్ మీదుగా ఓఆర్ఆర్ వరకు 150 అడుగుల వైశాల్యంతో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా.. ఇటీవల కాలంలో బడంగ్‌పేట కౌన్సిల్ సమావేశంలో 100 అడుగులకు కుదిస్తూ తీర్మానం చేశారని గుర్తు చేశా రు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్లాట్ యజమానులు ఇంటి నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటే మున్సిపల్, హెచ్ఎండీఏ అధికారులు 150 అడుగుల వరకు అనుమతి ఇస్తున్నారని తెలిపా రు. ప్రభుత్వ భవనాలకు ఒక నిబంధన, ప్రైవేటు భవనాలకు మరొక నిబంధనా అని అన్నారు.

ఇటీవల కార్పొరేషన్‌లో నిధులు లేకపోయినా గత కౌన్సిల్ కోట్లాది రూపాయల పనులను ఎజెండాలో పొందుపరచి, కౌన్సిల్, టెక్నికల్ అనుమతులు రాకుండానే, టెండర్ ప్రక్రియ పూర్తికాకుండానే సంబంధిత కాంట్రాక్టర్లకు నామినేషన్ పద్ధతిన పనులను ఇస్తున్నారన్నారు. సదర్ కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకంగా చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. కొన్నిచోట్ల జరిగిన పనులకే మళ్లీ టెండర్లు పిలుస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చినటువంటి ప్రత్యేక నిధులు రూ.50 కోట్లను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకొని, అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బడంగ్ పేట కార్పొరేషన్ 1,2 అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీర కర్ణారెడ్డి, తుర్రి మల్లేశ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు , ఫిబ్రవరి 10. పాడిరైతులు ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. కందుకూరు పశు వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని అన్నోజిగూడ గ్రామంలో డాక్టర్ రేవతి సమక్షంలో ఉచిత పశువైద్య శిబిరం, ఉచిత గర్భకోశ వ్యాధి శిబిరాలను నిర్వహించారు. 86 పాడి పశువులను పరీక్షించి అందులో 42 గర్భకోశ వ్యాధులను నిర్వహించారు. ఈ పందర్భంగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... పాడి రైతులకు సీజనల్ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూ చించారు. గాలికుంటు వ్యాధి రాకుండా సకాలంలో మందులు వేయించాలని పేర్కొన్నా రు. పాడి రైతులు ఆర్థికంగా ఎదగడానికి పా డి పశువులకు వ్యాధులు సంభవించకుండా చూసుకోవాలని కోరారు. సమీపంలో ఉన్న పశువైద్యాధికారులను , సిబ్బందిని సంప్రదించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం పాడి పశువులకు సబ్సిడీపై అందజేసే మందులను, విత్తనాలను సకాలంలో తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ రేవతి, షాహిన్ షైన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాకి దశరథ ముదిరాజ్, గోరింకల యాదయ్య ముదిరాజ, సిబ్బంది జంగయ్య .మాధవి .నరేశ్, అప్పర్. అరీఫ్, నరేశ్, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు .

## పెండింగ్ పనులకు నిధులు కేటాయించాలి

ఎల్బీనగర్ : ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తున్న డబ్బులను ఈ ప్రాంత అభివృద్ధికే కేటాయించాలని మనుసురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన.. జోనల్ కమిషనర్ హేమంతా కేశవపాటిల్‌ను కలిసి.. డివిజన్ అభివృద్ధి కోసం రూ. 2 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. టెండర్ ప్రక్రియ పూర్తయి పెండింగ్‌లో ఉన్న పనుల కోసం నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్ కోరిన వెంటనే ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, యూజీడీ పనుల నిమిత్తం నిధులు మంజూరు చేశారని తెలిపారు.

## ఉమెన్స్ థీమ్ పార్కు పనులను వేగవంతం చేయాలి

*జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి , తదితరులు*

వనస్థలిపురం, ఫిబ్రవరి 10 : బీఎన్ రెడ్డి నగర్ డివిజన్, ఎన్జీవోస్ కాలనీలో నిర్మించే ఉమెన్స్ టీం పార్కు పనులను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు కటిక రెడ్డి అరవింద్ రెడ్డి కో రారు. ఈ మేరకు సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరవింద్ రెడ్డి మాట్లాడుతూ .. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చొరవతో గతంలో ఎన్జీవోస్ కాలనీలో ఉమెన్స్ థీమ్ పార్కు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. అందుకు మరిన్నీ నిధులు అవసరం కావడం తో చొరవ తీసుకొని మరో రూ.80 లక్షలను ఎమ్మెల్యే మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. నిధుల మంజూరు పత్రాలను జోనల్ కమిషనర్ అందజేశారు. త్వరలో పనులను చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తిపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. డివిజన్లో అసంపూర్తిగా ఉన్న మిగతా పార్కులను పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అనిల్ చౌదరి, ఎన్జీవోస్ కాలనీ మహిళలు వర్ధిని, వాణి, తరుణం, కౌసర్, సంధ్య, సత్య తదితరులు పాల్గొన్నారు

## యథేచ్ఛగా సెల్లార్ల తవ్వకాలు

చంపాపేట, ఫిబ్రవరి 10 : ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో సెల్లార్ల తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపడుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో ఎల్బీనగర్‌లో సెల్లార్ తవ్వుతుండగా మట్టిపెళ్లలు పడి ముగ్గురు కార్మికులు మృతి చెందిన ఘటనలు ఉన్నా.. సెల్లార్ల తవ్వకాలకు టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇస్తూనే ఉన్నారు. లింగోజిగూడ డివిజన్, కర్మన్‌ఘాట్ చౌరస్తా సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రధాన రహదారులపక్కనే ఎలాంటి అనుమతులు లేకుండా సెల్లార్లు తవ్వి భవనాలు నిర్మాణాలు చేపడుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా సెల్లార్లు తవ్వకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## భార్యతో గొడవ పడి వెళ్లిపోయాడు..

*నవీన్ కుమార్ (ఫైల్)*

మలక్‌పేట, ఫిబ్రవరి 10: భార్యతో గొడవ పడిన భర్త కనిపించకుండా పోయాడు. ఈ సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం.. శ్రీపురం కాలనీలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న నవీన్ కుమార్(35) వివాహం 2011లో మమతతో జరిగింది. నవీన్ కుమార్ విష్ణు రెసిడెన్సీలో వాచ్‌మన్‌గా పనిచేస్తుండగా, మమత ఆ అపార్ట్‌మెంట్ కి సమీపంలో కూరగాయలు అమ్ముతుంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. నవీన్ కుమార్ చిన్న, చిన్న విషయాలకు భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఈనెల 7న మమత కూరగాయలు అమ్ముతుండగా అక్కడికి వచ్చిన నవీన్ కుమార్ భార్యతో గొడవ పడి ఇంటికి వెళ్ళిపోయాడు. సాయంత్రం నాలుగు గంటలకు ఇంటికి చేరుకున్న మమతకు భర్త కనిపించలేదు. దాంతో ఆందోళనకు గురై మూడు రోజులుగా అన్నిచోట్లా వెదికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం మలక్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై సురేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అతని ఆచూకీ తెలిసినవారు 8712660574 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

## రంగరాజన్‌పై దాడి అమానుషం

వనస్థలిపురం, ఫిబ్రవరి 10: ప్రఖ్యాత చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన పూజారి రంగరాజన్‌పై దాడి అమానుషమని వనస్థలిపురం బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. లోక కల్యాణం కోసం పనిచేసే అర్చకుల మీద దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఇటీవల కాలంలో బ్రాహ్మణులు, అర్చకులపై దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమసమాజ నిర్మాణానికి కృషి చేసే బ్రాహ్మణుల మీద ఇలాంటి దాడులు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రంగరాజన్ ఎంతో మంచి వ్యక్తిగా పేరు పొందాలని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిపై ఎలా దాడి చేస్తారన్నారు. దానికి కారకుడైన వీర రాఘవ రెడ్డి అనే వ్యక్తికి కఠిన శిక్ష పడేలా పోలీసులు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సంఘం గౌరవ అధ్యక్షుడు వంగపతిరావు, అధ్యక్షుడు పోచంపల్లి శ్రీధర్‌రావు , కార్యదర్శి నందిరాజు లక్ష్మీనారాయణ , సంఘటన కార్యదర్శి గోవుల రాంబాబులు డిమాండ్ చేశారు

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

బడంగ్‌పేట, ఫిబ్రవరి 10: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడకు చెందిన పుస్తకాల శ్యామ్ ప్రసాద్ (40) కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళా సంఘం వార్షికోత్సవం ..

*మహిళా సంఘం వార్షికోత్సవంలో పాల్గొన్న చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి, తదితరులు*

ఆర్కేపురం, ఫిబ్రవరి 10 : మహిళలు స్వావలంబన, సామాజిక సమానత్వం సాధించేదిశగా ముందుకు సాగాలని సామాజిక సేవకురాలు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని శ్రీరామకృష్ణ పురం కాలనీ మహిళా సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.సత్య మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు అన్నపూర్ణ, సెక్రటరీ రాధ, కోశాధికారి విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు నీలిమ, అర్చన, స్వప్న, సురేఖ, మాధవి, శకుంతల, పుష్పరేఖ, సరిత, రాణి తదితరులు ఉన్నారు.

## జన్మదిన వేడుకలు.. రక్తదాన శిబిరం

రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా సోమవారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి రక్తదానం చేశారు. *– ఎల్బీనగర్, ఫిబ్రవరి 10*

## అనాథ విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్ అందజేత

ఎల్బీనగర్, ఫిబ్రవరి 10: చదువులో విద్యార్థులు ఉత్తమంగా రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని భారత రాష్ట్ర సమితి రాష్ట్ర యువ నాయకుడు శివ ప్రకాశ్ అన్నారు. సోమవారం భారత రాష్ట్ర సమితి చైతన్యపురి నాయకుడు శ్యామ్ జయంతి సందర్భంగా సోమవారం చైతన్యపురిలోని ఆదర్శ్ అనాథ విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు, కొత్తపేట ప్రభుత్వ పాటశాల విద్యార్థులకు పరీక్షా ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా శివ ప్రకాశ్ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అజయ్, రాకేశ్, రవి యాదవ్, సాయి యాదవ్, సూర్య, కల్యాణ్, సుబ్బు, గని , ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మేయర్‌కు సత్కారం

బడంగ్‌పేట, ఫిబ్రవరి 10: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్, 31వ డివిజన్ శ్రీ సాయి బాలాజీ హోమ్స్ ఫేస్ –2 కాలనీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మానం కార్యక్రమంలో మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిగిరింత దంపతులను కాలనీవాసులు సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ... కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. పోటీ చేసిన సమయంలో ఈ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం చూసి ప్రచార సమయంలో చాలా ఇబ్బందులు పడ్డామన్నారు. అందరి సహకారంతో కార్పొరేటర్‌గా గెలవడం జరిగిందన్నారు. పాలకవర్గ సభ్యుల సహకారంతో మేయర్ కావడంతో రోడ్లు, డ్రైనేజీలు పూర్తి చేయగలిగానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

సైదాబాద్, ఫిబ్రవరి 10: మలక్ పేట్ నియోజకవర్గపరిధిలో రేషన్ కార్డులు లేనివారందరూ కొత్త రేషన్ కార్డుల కోసం మీ –సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. ఇప్పటి వరకు రేషన్ కార్డులు లేనివారందరు కొత్త కార్డుల కోసం సమీపంలోని మీ– సేవా కేంద్రాలకు వెళ్లి తమ పేర్లను, కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా రేషన్ కార్డుల్లో కొత్తవారి పేర్ల నమోదుతోపాటు తప్పొప్పులను కూడా సరి చేసుకోవచున్నని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## యువతి అదృశ్యం

కాచిగూడ, ఫిబ్రవరి 10: ఇంట్లోంచి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై పి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలానా ఆజాద్ నగర్ ప్రాంతానికి చెందిన సురేశ్ కుమార్తె సంజన(14) ఈ నెల 8 న ఇంట్లోంచి వెళ్లి ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో కలతచెందిన కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# జీహెచ్ఎంసీ స్థలంలో పార్కు ఏర్పాటు చేయాలి

*జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి వినతిపత్రం అందజేస్తున్న కమలానగర్ వాసులు*

మనసురాబాద్, ఫిబ్రవరి 10: సహారా స్టేట్స్ కాలనీ మొదటి గేటు సమీపంలో ఖాళీగా ఉన్న జీహెచ్ఎంసీ స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, కమలానగర్ కాలనీవాసులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు.. జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి వినతి పత్రం సమర్పించారు. జీహెచ్ఎంసీకి చెందిన 800 గజాల స్థలం ఖాళీగా ఉండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు అందులో చెత్తాచెదారాన్ని వేయడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా తయారవుతున్నదని కమిషనర్‌కు తెలిపారు. దీంతో సదరు స్థలాన్ని పార్కుగా అభివృద్ధి చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఖాళీ స్థలంలో పచ్చదనాన్ని పెంపొందించడంతోపాటు వృద్ధులు, మహిళలు కూర్చునే విధంగా బెంచీలను ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి సమయంలో ఇక్కడ సేద తీరేందుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. దీంతోపాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినట్లయితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు విన్నవించుకున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ వెంటనే స్పందించి ఖాళీగా ఉన్న జీహెచ్ఎంసీ స్థలాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌కు ఫోన్‌లో ఆదేశించినట్టు మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, కమలానగర్ కాలనీకి చెందిన వనం శాంతి కుమార్ తెలిపారు.

## మంద ప్రభాకర్‌కు బంగారు నంది అవార్డు

కందుకూరు, ఫిబ్రవరి 10: కందుకూరు మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రజా గాయకుడు మంద ప్రభాకర్ బంగారు నంది అవార్డును అందుకున్నారు. తెలుగు కళా రత్నాల సంస్కృతిక సేవా సంస్థ జాతీయస్థాయిలో ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేశారు . అవార్డును సినీ ప్రముఖులు రాజబాబు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సామెల్ ఆయనకు అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. తనను అవార్డుకు ఎంపిక చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దీంతో తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు కళా సంస్కృతి సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రత్నం, ధనరాజు ఉషారాణి పాల్గొన్నారు

## మద్యం మత్తులో కారు నడుపుతూ ..

బంజారాహిల్స్,ఫిబ్రవరి 10: మద్యం మత్తులో కారు నడిపిస్తూ పుట్‌పాత్ పైకి ఎక్కిన ఘటనలో నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే..నాంపల్లికి చెందిన కాజిల్ మాలిక్(26) అనే యువకుడు ఆదివారం తెల్లవారుజామున బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని హయత్ ప్యాలెస్ హోటల్ మీదుగా పంజాగుట్ట వైపునకు తన బెలానో కారులో ప్రయాణిస్తున్నాడు. పీకలదాకా మద్యం సేవించిన మాలిక్ అతివేగంగా కారు నడిపిస్తూ అదుపుతప్పడంతో కారు పుట్‌పాత్ మీదకు ఎక్కింది. ఘటనపై సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు అక్కడకు వచ్చి కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో పుట్‌పాత్ మీద ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పింది. కాగా మాలిక్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా మోతాదుకు మించి మద్యం సేవించినట్లు తేలింది. ఈమేరకు అతడిపై డ్రాష్ డ్రైవింగ్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

బంజారాహిల్స్,ఫిబ్రవరి 10: పరీక్షలు సరిగా రాయలేకపోతున్నాని మనస్థాపానికి గురైన ఇంటర్మీడియట్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్ సమీపంలోని బీజేఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న విజయ్‌కుమార్(17) రాయదుర్గం ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఏడాదిన్నర క్రితం తండ్రి మరణంతో తల్లి సైదమ్మతో కలిసి ఉంటున్నాడు. కాగా తండ్రి మరణంతో పాటు పరీక్షలు సరిగా రాయలేకపోతున్నానని, ఇటీవల ప్రాక్టికల్ పరీక్షలు కూడా బాగారాయలేదని మనస్థాపానికి గురైన విజయ్‌కుమార్ ఆదివారం రాత్రి తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు తల్లి సైదమ్మ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మారణ హోమాన్ని ఆపేయండి

హిమాయత్ నగర్, ఫిబ్రవరి10: కార్పొరేట్ శక్తులకు ఆదివాసీల ఖనిజ సంపదను కట్టబెట్టేందుకే మావోయిస్టులను కేంద్రం అంతం చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్ బోస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో సామాజిక, ఆర్థిక,రాజకీయ రంగాల్లో మార్పు రాకుండా మావోయిస్టు భావజాలాన్ని లేకుండా చేయడం అసాధ్యమన్నారు. ఆదివాసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కేంద్ర,రాష్